# కొలనులో కలువ ★

రచన :
కె. బి. కె. పట్నాయక్

గదినోసారి ఎగాదిగా చూసి మరి పదే పదే ఆలోచించకుండా అన్ని నిబంధనలకూ సరే సరే అని ఒప్పేసుకుని అడ్వాన్సు చెల్లించేశాను! అవుసరం అటువంటిది మరి!

వెంటనే ఆకలినైనా లెక్కచేయకుండా అత్తవారింట్లోవున్న ఆలిని తెచ్చుకోవటంకోసం అప్పుడే బయల్దేరబోతూన్న ధూమశకటాన్నెక్కేశాను! వెళ్లేటప్పుడు ఎంత గాభరాగా బయల్దేరానో అంతే అర్జంటుగా తిరిగికూడ రావాల్సి వచ్చింది! లేకపోతే ఆ దొరికిన కొంప కూడ చేయిజారిపోతే ఇక మన పని త్రిశంకు నరకమే!

కొత్తగా కాపరం వెలిగిస్తామన్న సంబరం వల్ల మా జలజముఖం కొత్తరంగుల్ని చేకూర్చుకుంది. కాని తీరావచ్చి ఆగదిని చూచేసరికి అమ్మాయిగారి ఆనందం ఆవిరయికూచుంది. 'ఇదేం యిల్లు' అన్నట్టు చూసింది నావేపు. నేనుమాత్రం పెట్టె, బెడ్డింగు, మిగతా చిల్లరసామాను....ఆఁ మర్చిపోయా—ఓ పేద్ద ఇత్తడి గంగాళం ఇవన్నీ సర్దటంలో మునిగిపోయినట్లు నటించి ముఖం తిప్పేసుకున్నా! చివరకు ఏఁవనుకుందో ఏమో వచ్చి సర్దటములో తనూ కలుగజేసుకుంది. ఇంతా చేస్తే గదికి ఒకటీబై నాలుగోవంతు ఆ గంగాళం ఆక్రమించేసింది. అందుకే దాన్ని తెస్తున్నప్పుడే నే నన్నాను — "అదెందుకు జలజా! అమ్మోరులా వుంది! ఇంకెప్పుడైనా తీసుకెళ్లొచ్చులే!" అని. కాని ఒప్పుకుంటేనా? "మీకేం తెల్సులెండి? వస్తువు అనేది ఒకటి వుంటే ఎప్పటికైనా పనికివస్తుంది. తీసుకుపోదాం!" అన్నది. ఎంతయినా అమ్మగారిచ్చిన వస్తువు కదా! అందులోనూ భారీగా, హుందాగా, అందంగావుంది. ఆమాత్రం మక్కువవుండదా అని సరే అని సమ్మతించాను. తీరా చూస్తే అదే ఇంతచోటు ఆక్రమించేసింది.

"చూడగా చూడగా మహా గొప్ప యిల్లే చూశారండీ!" ఉస్సురని బెడ్డింగుమీద కూలబడుతూ అన్నది జలజ వెటకారంగా. గాని యీ యిల్లు చూసేసరికే ఎన్ని తంటాలు, తదాయిదాలు పడ్డానో దానికెలా తెలుస్తుంది? రెండు మాసాలయి ఇంటిగురించి ఎంతని తిరగలేదు?....

....ఆవేళ ఏదో మాటల సందర్భంలో తెలిసింది ఫలానా షావుకారింట్లో ఓపోర్షను ఖాలీగా వుందని! స్కూలు విడిచిబెట్టగానే వెంటనే బయల్దేరి ఆ షావుకారింట్లో అరాతీశాను.

'అవును! ఒక కొ....గది ఖాలీగావుంది' అన్నాడా షావుకారు. 'కొ....గది' అనగానే దాని ఊహాచిత్రం ఓసారి తళుక్కున మెరిసింది! ఈ షావుకారు ఓ కొట్టుగదిని ఇల్లుగా సరఫరా చేస్తున్నాడన్నమాట! లేకపోతే అద్దె ఎక్కువ రావద్దూ? ఏదయినా చేసేదేముంది? నాతిగల బ్రహ్మచారిగా గడపాల్సివస్తుంది! పెళ్లయి ఆరు మాసాలయింది! నిత్యనూతనంగా ఉండాల్సిన పరిస్థితిపోయి బదుకు తెరువుకోసం బడిపంతులుగా బస్తీలో బసవేసి ఇదేం ఖర్మరా భగవంతుడా అని ఉత్తరాల ద్వారానే ఇద్దరం మనసు కుదుటపర్చుకోవలసి వచ్చేది. అందువలన ఆ కొ....గదయినా కావాలని అడిగాను.

తరువాత షావుకారు వరుసగా ప్రశ్నించాడు పేరేమిటి?....తండ్రిపేరు ?.... ఊరు?....ఏం చేస్తున్నావ్....ఏ బళ్లో ? .... జీతం? .... పెళ్లయిందా?....పిల్లలెందరు? .... ఎన్నాళ్లయింది పెళ్లయి?

ఈ వగైరా ప్రశ్నలకు సదుత్తరాల్నిచ్చి అయనకు హామీ యిచ్చాను—చూడండి షావుకారుగారూ! మా వలన మీకు ఎటువంటి యిబ్బందీ కలుగదు! ప్రతీనెలా ఒకటోతారీఖు నాటికి మీకు ముట్టాల్సిన అద్దె పువ్వుల్లోపెట్టి యిచ్చేస్తాం!"

షావుకారుకి నమ్మకం కలిగినట్లుంది. బొడ్లోంచి తాళాలగుత్తుతీసి—"పదండి చూపిస్తాను" అని ముందుకు నడిచాడు.

షావుకారు ఇంటికి సంబంధించే దుకాణం వుంది. ఆ దుకాణానికి ఎడమప్రక్కగా ఓ కొట్టుగదివుంది. ఆ గదికి ఓ తలుపు తప్పించి ఒక కిటికీగానీ, మరెటువంటి వెంటిలేషన్ గాని లేదు. గది చాల చిన్నది. షావుకారు దుకాణానికీ, ఆ గదికీ కామన్‌గా ఓ వరండా వున్నది.

ఆ గదిని చూపిస్తూ షావుకారన్నాడు — "ఇదిగో పంతులుగారూ! ఇందులో ఇంతకు ముందు ఓ నాటువైద్యుడు ఉండేవాడు. నెలకు ఇరవై యిస్తుండేవాడు."

తృళ్లిపడ్డాను! ఎలక్షన్లముందు కాబోయే ఎం. ఎల్. ఏ. లు బట్టీపెట్టి గడగడ వప్పచెప్పేసిన స్పీచ్‌లా నా గుండెకాయ దడదడలాడటం మొదలయింది.

ఎలానో చివరకు సంబాళించుకొని—"షావుకారుగారూ! ఈ గదిలో ఒక్క కిటికీయైనా లేదు" అన్నాను నసుగుతూ!

"తలుపువుందిగా!" టకీమని జవాబిచ్చాడు షావుకారు.

మరి కాస్త లోనికి తొంగిచూశాను. గది నుంచి చెడునీరు పోవటానికి మోరీగాని, మరే విధమయిన సదుపాయంగాని ఎక్కడా అవుపించటంలా! మొత్తంమీద అదో యింటిక్రింద లెక్కకాదు! కాని కర్తవ్యం?....మళ్లీ మెల్లగా అన్నాను "మరి నీళ్లకొసరం కొళాయి గట్రా!"

"అదిగో!" అంటూ అక్కడికో వందగజాల దూరంలోవున్న మునిసిపాలిటీవారి కొళాయి చూపించాడా మహానుభావుడు!

"అబ్బా చాల దూరం! స్నానపానాలకు చాల కష్టం!" మొత్తంమీద నాకు ఆగది ఏమాత్రం యిష్టంలేకపోయింది. ఆ విషయం పసికట్టి ఖండితంగా చెప్పాడు షావుకారు— "ఇదిగో అబ్బాయ్! ఇదేగది! తర్వాత ఆఁ—వూఁ అంటే లాభంలేదు! అద్దె పదిహేను రూపాయిలౌతుంది! తర్వాత నీ యిష్టం!"

ఇంకేం చేయటం? గదినోసారి ఎగా దిగా చూసి, మరి పదేపదే ఆలోచించకుండా, అన్ని నిబంధనలకూ సరే సరే అని ఒప్పేసుకుని అడ్వాన్సు చెల్లించేశాను! అవుసరం అటువంటిది మరి!........

ఈ విషయాలన్నీ విన్నాక తెలివిగల పిల్ల జలజ కొంపనే అనుకూలంగా తయారుచేసుకోవటానికి నానా తంటాలుపడి చివరకు ఓ రూపాన్ని తెచ్చింది.

మేము వచ్చామని తెలిసి షావుకారుగారి యింటావిడ గున్నయేనుగులా వచ్చి ఎంతో ఆప్యాయంగా - ఆదరంగా పలకరించి తన పరిచయాన్ని చెప్పుకొని మాటల్లోనికి దిగింది. నేను యింటి కెదురుగావున్న అరుగుమీద ఈజీచెయిర్‌వేసుకొని కూర్చున్నాను. షావుకారుగారి భార్య కలుపుగోలుతనం చూసి ఇక జలజకు ఊసుపోకపోవటం అనేమాట వుండదని ఆనందించాను.

ఆవిడ ఆ గదిని ఇన్స్‌పెక్షన్‌చేస్తు అంది "వచ్చి ఓపూటయినా కాలేదు అంతా చక్కగా అమర్చేశావే! ఇక్కడవంటకోసఁవా? బావుంది! ఈ మూల పూజగురించా!....భేష్ .... అలా వుండాలి చలాకీ తనమంటే!....ఇదేఁవిటీ!.... గంగాళఁవా ? చాల పెద్దదే! బావుంది సుమీ అమ్మాయీ!"

"అవునండీ! అది మా వాళ్లిచ్చారు నాకు!" గర్వం తొణికిసలాడుతోంది మా యావిడ మాటల్లో!

"పోనీ యేదోలే! దానివల్లనయినా యిల్లు నిండుగా కలకల్లాడుతూవుంది!....సరే మళ్ళా తీరుబడి చూసుకొని వస్తాను!" అని వెళ్ళిపోయిందావిడ!

★ ★ ★

ఏలయినంతవరకూ నన్ను బాధపెట్టకుండా తన పనులు నిర్వర్తించుకుంటూ పోవటానికి

ప్రయత్నిస్తుంటుంది జలజ! కాని కొళాయి నుంచి నీళ్ళు తేవటం మాత్రం నాదైనందిన కృత్యాల్లో ఒకటయికూర్చుంది. మొత్తంమీద మా జీవితం ఆనందంగా, హాయిగా సాగిపోతోంది.

ఓనాడు తెల్లారేసరికి షావుకారుగారి భార్య వచ్చి "అమ్మడూ! కార్తీక సోమవారాలు ఈ యేటితో ఉద్యాపనచేసేస్తున్నాను. ఆ సందర్భంలో కొంతమంది బ్రాహ్మలకు భోజనాలు చెప్పాలి. వంటలుకూడ బ్రాహ్మలచేతే చేయిస్తున్నాం! అందుగురించి యివాళ మీయింట్లో నిప్పువేయకండి!" అని చెప్పేసి వెళ్ళింది.

ఆవేళ తెల్లారినుండీ షావుకారుగారింటిలో గొప్పహడావుడిగావుంటే ఏఁవిటో అనుకున్నాం! ఇదీ సంగతి! ఆవిడ చెప్పి వెళిపోయిన మరో అరగంటకల్లా తిరుగావచ్చి — "అమ్మడూ! ఒక్కసారి మీగంగాళం యిస్తావూ? అందులో మిఠాయిశేయాలి! మా నౌకర్ని దేవాలయం వెళ్లి తెమ్మందునుగాని, ఆ వంటబ్రాహ్మడు ఒకటే తొందర!....కాస్త యిద్దూ!" అన్నది.

"అయ్యో! మీ రంతగా అడగాలా పిన్నిగారూ? ఇటువంటి సమయానకు కాకపోతే ఎందుకీ వస్తువులు ? .... తప్పకుండా తీసుకెళ్లండి! మీ నౌకర్ని పంపించండి యిస్తా!" అని పిన్నిగారికి కూతురుగారు హామీయిచ్చారు!

ఆనాటి విందు దివ్యంగా జరిగిపోయింది. మరునాడు తెల్లారిలేచి కొళాయివద్ద స్నానం చేసి నీళ్లు తెచ్చేశాను. జలజ వెంటనే వెళ్లి గంగాళం అడిగి తీసుకురమ్మంది.

"ఇంత తెల్లారగట్లానే!" అన్నాను నేను.

"మరేంచేయడం? దాని అవుసరం యిప్పుడేగా!" అంది జలజ.

షావుకారు యింటికివెళ్లి అడిగాను. నౌకరును తీసుకురమ్మంది ఆ వి డ. నౌ క రు లోనుంచివచ్చి — "ఇంకా అది అంటుగానే వుందమ్మా! అంటూ తోమేది వొస్తే తీసికెళ్లి యిచ్చేత్తా" అన్నాడు.

"తర్వాత పంపించేస్తా బాబూ! లేదూ అంత అవుసరం అయితే నేనే తోమేస్తాను" అంది ఆవిడ.

"అబ్బే! అంత తొందరలేదులెండి!" అని వచ్చేశాను. వెధవది అనలేే మొహమాటం నాకు !

"ఏదీ గంగాళం?" అనడిగింది జలజ.

"తర్వాత పంపించేస్తామన్నారు" అన్నాను మెల్లగా.

"బావుంది! కాని అది లేకుండా ఇవతల యీ పనులన్నీ ఎలా జరుగుతాయి? వెళ్లండి వెళ్లి అడగండి!" అన్నది.

"అయితే అది ఎందుకోసం అంత అవుసరమో చెప్పమంటావా ? నాకుమాత్రం సిగ్గేస్తుంది చెప్పటానికి!"

"సిగ్గెందుకు? వెళ్లి తెచ్చేయండి! ఇవతల పనులన్నీ పడివున్నాయ్!"

ఉన్నది యిద్దరమే అయినా పనులు తగ్గవుగా! తెల్లారిలేచి ఇల్లూ, వాకిళ్ళూ తుడుచుకొని, స్నానంచేసి వంటా వార్పూ చేయాలిగా!

చివరకు వెళ్ళక తప్పిందికాదు — "ఆ గంగాళం యిచ్చేయండి! చాల అవుసరం!" అన్నాను బిడియపడుతూ !

షావుకారుగారి సతీమణి విసురుగా లోనికి వెళ్ళి నౌకరుతో "ముందా గంగాళం తోమేసి ఆ మేష్టరు మొహాన పడెయ్! ఈమాత్రంవస్తువుని కొరుక్కుతినేసినట్టు పదిసార్లు వచ్చేడు" అన్నది.

నా అభిమానం దెబ్బతిన్నది! తల తిరిగిపోయింది! ఏం చేయటం? అవుసరం! అడగకుండా వుండలేం !

గంగాళాన్ని తీసుకెళ్తుండగా షావుకారుగారి భార్యా స్వరం వినిపిస్తూనేవుంది — "ఓచిన్న వస్తువుకోసం పదిసార్లు వచ్చేడు. అవుసరానికి ఆదుకొనకపోయినవాళ్ళు ఎందుకు?"

ఆ మాటలు నన్ను చాల బాధించాయ్! అయినా ఏం చేయను ? గంగాళాన్ని జలజకిచ్చేసి వరండాలో ప చా రు చేయసాగాను. అక్కడకుకూడ షావుకారుదీ, ఆయన భార్యదీ కంఠస్వరాలు వినిపిస్తునేవున్నాయ్.

షావుకారు అంటున్నాడు—"ఇంత తెల్లారేసరికి వీళ్లకీ గంగాళం అవుసరం దేనికీ ? .... కొంపదీసి వీళ్ళుకూడ ఏ సంతర్పణ అయినా చేయరుకదా ! "

"ఆఁ ఆఁ! సంతర్పణ చేయాలంటే గుండెల్లో కండలుండాలి! మన కడుపుకు రెండు పూటలా పూర్తిగా తింటే సంతర్పణ బెట్టేంత ఫలం!" షావుకారుభార్యా వ్యంగ్యంగా అన్న ఈ మాటల్ని వినేసరికి నా వళ్లు కుత కుత ఉడికిపోనారంభించింది.

"అయితే మరెందుకయినట్టు?" ఆలోచనలో పడినట్టుంది షావుకారు.

అంతలో నౌకరు గొంతు వినిపించింది— "ఈలకిముందు ఆ గదిలోవున్న వొయిద్దుడు అలాంటి గంగాలంలోనే మందుసేస్తూ ఒకసారి విసం...."

"ఆఁ అవును! అందుకే జైల్లో బెట్టేశారు వాణ్ణి" అన్నాడు షావుకారు.

ఆయన భార్య అన్నది—"అతగాడు పేరుకైనా వైద్యుడే! వీళ్లేంటి? ఏదో పల్లెటూరినుంచి ఊడిపడ్డారు! వీళ్లకు వైద్యం తెలిసి యేడ్సిందేఁవిటి?....అయినా ఏమో లెండి!....చేతకాకపోయినా తగుదునమ్మా అంటూ బయల్దేరుతారు ఇటువంటివారు! వీళ్ల వైద్యంతో ఎవరి ప్రాణాలయినా గుటుక్కుమంటే మ ధ్య న మనకు పడుతుంది ఉరితాడు!"

"గోళ్లతో మీటాల్సినదానికి గొడ్డలితోతవ్వడం దేనికీ? ఇప్పుడేవెళ్లి అదేఁవిటో తేల్చుకొస్తాను" అంటూ అరవై మైళ్ళ స్పీడులోవచ్చి వరండాలో నడన్‌బ్రేకువేశాడు షావుకారు. అప్పటి సరికి గదితలుపువేసివుంది. బయట యీజీ చెయిర్‌లో నేనున్నాను. షావుకారు సందేహం దృఢతరమైంది. పట్టపగలు తలుపువేసుకొని లోపల ఒకరు, బయట కావలికాస్తు మరొకరు ఉండటానికి కారణం ఏఁవిటా అన్నట్టు వేసివున్న తలుపువైపు ఓసారి, నా వైపోసారిచూసి అన్నాడు షావుకారు — "చూడు పంతులూ! మీకన్న ముందు ఓ నాటువైద్యుడుండేవాడు ఇందులో. వాడిదగ్గరకూడ ఓ గంగాళం వుండేది. అందులో మం దు లు తయారు చేస్తుండేవాడు. ఓనాడు మందులో ఎలాగో విషం కలిసింది దానితో...."

"షావుకారుగారూ! మీ కా చింత అవుసరం లేదు. మేం ఆ గంగాళంలో విషం తయారు చేయటంలేదు" అన్నాను చిరాగ్గా.

"మరి....మరి...."

"మేం వైద్యులంకాము షావుకారుగారూ! గంగాళం అవుసరం కలిగింది, తీసుకొచ్చాం! అదీ తప్పేనా?"

"షావుకారు కాస్త మెత్తబడ్డాడు–"అయితే అందులో వండుకుంటారా?"

"మీదయవల్ల వండుకోటానికి వేరే తప్పేలాలున్నయ్"

"అయితే అందులో భోంచేస్తారా?"

"అది మీకు అలవాటేమో?"

"అయితే మరేం చేస్తారయ్యా! ఇద్దరూ కట్టకట్టుకు నిద్రపోతారా?"

షా వు కా రు మాటలు విన్నకొద్దీ అరికాలి మంట నెత్తికొస్తుంది. తను చేస్తున్నపనులన్నీ సవ్యంగా వున్నాయనుకుంటున్నాడు కాబోలు!

"షావుకారూ! గంగాళంతో మాకేంపని అని కదూ నీ సందేహం! ఆయితేచూడు!" అంటూ తలుపు ఒక్కసారి బార్లా తెరిచేశాను! షావుకారు లోపల దృశ్యంచూసి తెల్లబోయాడు! ఆ గంగాళంలో కూచొని జలజ స్నానంచేస్తుంది. తిరుగా అన్నాను — "వయసులోవున్న స్త్రీ ఆ కొళాయివద్ద బహిరంగంగా స్నానం చేస్తుందనుకున్నావా? మావద్ద అబానవంటిగంగాళం వుంది గాబట్టి సరిపోయింది! లేకపోతే మా గతేంకానో?"

పాపం షావుకారు నోరు వెళ్లబెట్టుకొని, కళ్లు చిరుకుంటూ చూస్తుండిపోయాడు! కాని నాకు మాత్రం కొలనులో వికసిస్తున్న కలువలా అవుపించింది నా జలజ.

(హిందీ ఆధారం)

★